సాక్షి
ఖమ్మం
7
మంగళవారం ౹ 3 ౹ సెప్టెంబర్ ౹ 2024

ఏ సాయమైనా చేస్తాం..



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

వరద తగ్గేవరకు బాధితులకు సహాయక చర్యలు

- అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టొద్దు
- మున్నేరుకు 80 ఏళ్లలో రాని వరద వచ్చిందట..
- బాధితులకు అభయమిచ్చేలా మంత్రులు క్షేత్రస్థాయిలో ఉండడం అభినందనీయం
- కలెక్టర్ ఖాతాలో అత్యవసర ఖర్చుల కింద రూ.5 కోట్లు
- పూర్తి స్థాయి నష్టంపై త్వరగా నివేదిక ఇవ్వండి
- జిల్లా పర్యటన, వరదలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాత్రి ఖమ్మంలోనే బస.. నేడు కారేపల్లి, మహబూబాబాద్‌లో పర్యటన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మీకు ఏ సాయం కావాలన్నా నష్టం అంచనాలు వేసి నివేదికలను నేరుగా సీఎస్‌కు పంపండి. అక్కడ నుంచి నా దగ్గరకు వస్తాయి. ఎంత మేర నిధులు కావాలన్నా మంజూరు చేస్తాం. వరద తగ్గేవరకు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ బాధితుల కోసం సహాయక చర్యలు కొనసాగించాలి. అధికారులు, సిబ్బంది సెలవులు పెట్టొద్దు. పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. పోలీసులు సహా ఇతర విభాగాల సిబ్బంది సేవలనూ ఉపయోగించుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు సూచించారు.

పంటపొలాలు, గండిని పరిశీలించి..

సీఎం సోమవారం సాయంత్రం 4.50గంటలకు జిల్లాకు రోడ్డుమార్గంలో చేరుకున్నారు. తొలుత పాలేరు రిజర్వాయర్ సమీపంలో ఎన్నెస్పీ కాల్వకు పడిన గండిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి పరిశీలించారు. పాలేరు అలుగు వద్ద దెబ్బతిన్న ఖమ్మం–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆయనకు మంత్రి పొంగులేటి చూపించారు. హట్యాతండా వద్ద పాలేరు వాగుతో నీట మునిగిన పంట పొలాలను కూడా సీఎం చూశారు. ఆపై ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప వద్దకు చేరుకున్నారు. ఇక్కడ వరద చేరుకున్న రెండు ఇళ్లలోకి వెళ్లి బాధితులతో మాట్లాడారు. అనంతరం ఖమ్మంలోని బొక్కలగడ్డ, మంచికంటి నగర్‌లోకి ఓపెన్‌టాప్ వాహనంలో వెళ్లి మున్నేరు వరదతో నీట మునిగిన కాలనీలను పరిశీలించారు. ఆ తర్వాత అక్కడ నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడగా ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఇది 80 ఏళ్ల క్రితం వరదంటా..

మున్నేరు, ఆకేరు, పాలేరు వరదలతో.. పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లోని పరీవాహక మండలాల్లో ప్రభావం చూపింది. ఈ పరీవాహకంలోని ఇళ్లు నీట మునగడంతో పాటు పంటలు బాగా దెబ్బతిన్నాయి. అయితే 80 ఏళ్ల క్రితం ఇలా వరద వచ్చిందని రాజీవ్ గృహకల్ప వద్ద పెద్ద మనుషులు చెప్పారు. ఇంతటి ఉపద్రవం ఎప్పుడు రాలేదట.. వరదలతో ఇళ్లల్లోకి చెత్తాచెదారం, బురద వచ్చింది. అధికారులు, సిబ్బంది బాధితులకు సహకరించేలా చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలోకి పరిశీలించి నష్టంపై నివేదికలు ఇవ్వాలి.

రేషన్, ఆధార్ వివరాలు సేకరించాలి..

వరద ముంపునకు గురైన బాధితుల ఆధార్, రేషన్ కార్డుల వివరాలు సేకరించాలి. 34 పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఇబ్బంది తలెత్తకుండా వసతులు కల్పించాలి. వరదలో బియ్యం, దుప్పట్లు, సర్టిఫికెట్లు కొట్టుకుపోవడంపై నివేదిక రూపొందించాలి. బాధితులకు ప్రభుత్వం అండగా ఉందన్న విశ్వాసం కల్పించాలి. తక్షణ సాయంగా రూ.10 వేలు వెంటనే అందిస్తే వారు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకుంటారు.

అన్ని శాఖలను వినియోగించుకోండి..

అన్నిశాఖల సేవలు ముంపు ప్రాంతాల్లో వినియోగించుకోండి. ప్రభుత్వం అందించే సాయం బాధితులకు వెంటనే చేరాలి. ఇందుకోసం సీఎస్‌కు నివేదిక పంపిస్తే ఆలస్యం కాకుండా సాయం అందుతుంది.

మంత్రుల సేవలు భేష్.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వరద ముంపుపై అప్రమత్తమై ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. వరద సహాయక చర్యల్లో నేరుగా పాల్గొని ఎప్పటికప్పుడు నాతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి సహాయక చర్యలు తీసుకున్నారు. వారి సేవలు అభినందనీయం.

మంత్రి పొంగులేటి నివాసంలో బస

సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు సీఎం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆ తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో బస చేశారు. మంగళవారం ఉదయం ఆయన కారేపల్లి మండలం గంగారం తండాకు వెళ్తారు. ఆకేరు వరదలో గల్లంతై తండ్రీకుమార్తెలు అశ్విని, మోతీలాల్ మృతి చెందగా వారి కుటుంబీకులను పరామర్శించి, అక్కడినుంచి మహబూబాబాద్ జిల్లాకు బయలుదేరుతారు.


మంత్రి పొంగులేటి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

వీలైనంత మేర నష్టాన్ని నివారించగలిగాం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాలతో అనూహ్యరీతిలో వరద వచ్చినా వీలైనంత మేర ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా నివారించగలిగామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సందర్భంగా ఆయన జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు వెల్లడించారు. ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపారు. గత నెల 31న వైరాలోని ఆరు వార్డులు, కొన్ని గ్రామాల్లోకి నీరు చేరిందని, 30నుంచి 40నివాసాల్లోనే భారీ వర్షపాతం నమోదైందని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలోని అజ్మీరాతండా, కూసుమంచి ప్రాంతాల్లో ఊహించనంత వర్షపాతం నమోదు కాగా పాలేరు, మధిర నియోజకవర్గాల్లో 193మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చామని తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరిని మాత్రమే కాపాడలేకపోయామని చెప్పారు. ఖమ్మంలో ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న 9మంది సైతం సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ప్రస్తుతం రహదారులు, వైద్యం, శానిటేషన్, విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.


పాలేరు ఎడమ కాల్వ గండి వద్ద..


బొక్కలగడ్డలో మాట్లాడుతూ..


రాజీవ్ గృహకల్పలోని ఇంట్లో పరిశీలిస్తూ..

25కు పైగా వంతెనలు ధ్వంసం | **తెగిన చెరువులు.. గండ్లు** | **రూ.7కోట్ల నష్టం** 8లో

వెంకటేశ్వరనగర్‌లో సామగ్రిని ఆరుబయట పెట్టి శుభ్రం చేసుకుంటున్న బాధితులు



సుడులు తిరిగిన కన్నీళ్లు


శుభ్రం చేసేందుకు సామగ్రి తీసుకెళ్తూ..

మున్నేరుకు అనూహ్యంగా వచ్చిన వరదతో ఖమ్మం, ఖమ్మం రూరల్ మండలాల్లోని పరీవాహక ప్రాంత కాలనీల్లోకి నీరు చేరింది. మున్నేరు నీటిమట్టం ఆదివారం రాత్రి క్రమంగా తగ్గుతూ సోమవారం ఉదయానికి సాధారణ స్థితికి చేరింది. దీంతో కట్టుబట్టలతో వెళ్లిపోయిన స్థానికులు ఇళ్లకు చేరుకునే సరికి నామరూపాలు లేకుండా పోయిన ఇళ్లు, సామగ్రిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఇల్లు, రోడ్డు తేడా లేకుండా బురద మేటలు వేయడంతో అడుగు తీసి అడుగు వేయడం కష్టమైంది. కళ్లలో కన్నీళ్లు సుడులు తిరుగుతుండగా ఒక్కో సామగ్రిని నుంచి నుంచి వేరు చేస్తూ ఈ కష్టాలకు కారణమైన మున్నేరు నీటిలోనే శుభ్రం చేసుకోవడం కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


వరదతో ఇంటి పైకప్పు లేచిపోవడంతో చేరిన బురద


వరదతో ఇంట్లోకి కొట్టుకొచ్చిన దుంగలు




వెంకటేశ్వరనగర్, మంచికంటి నగర్‌ల్లో సామగ్రి శుభ్రం చేసుకుంటున్న స్థానికులు

జీవీ మాల్ రూ.10 లక్షల ఆర్థిక సాయం


మంత్రికి చెక్కు ఇస్తున్న జీవీ మాల్ అధినేతలు గుర్రం నర్సింహారావు, ఉమామహేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: వరద బాధితులను ఆదుకునేందుకు జీవీ మాల్ వస్త్ర సంస్థ ప్రతినిధులు రూ.10 లక్షల చెక్కును రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు. జీవీ మాల్ అధినేతలు గుర్రం నర్సింహారావు, గుర్రం ఉమామహేశ్వరరావు ఖమ్మంలో సోమవారం మంత్రికి సీఎం రిలీఫ్ ఫండ్ పేరిట చెక్కు అందించారు. భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యాన వారికి చేయూతగా నిలిచేందుకు ఆర్థిక సాయం అందించినట్లు జీవీ మాల్ అధినేతలు చెప్పగా.. వారిని మంత్రి తుమ్మల అభినందించారు.

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- పేదల ప్రాణాలపై పట్టింపు లేదు
- మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు


ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ ఎదుట గోడు వెల్లబోసుకుంటున్న మహిళలు


ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పుట్టెడు దుఃఖంతో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఇకనైనా సహాయక చర్యలు ముమ్మరం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం పువ్వాడ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో తాగడానికి తాగునీరు ఇచ్చే వారు లేకపోవడం దారుణం అన్నారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు, ఇళ్లు దెబ్బతిన్న, నష్టపోయిన కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. తమ హయాంలో ముందు జాగ్రత్తగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను, హెలీకాప్టర్లను రప్పించామని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర మాట్లాడుతూ ఇలాంటి విపత్తులు ఎదురైతే బీఆర్ఎస్ హయాంలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి ప్రజల్ని కాపాడే వాళ్లమని చెప్పారు. కానీ ఇప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టడంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు తాను, పువ్వాడ, మాజీ ఎంపీ నామ మున్నేరు వరద శాశ్వత నివారణకు కరకట్ట నిర్మాణానికి రూ.690కోట్లు మంజూరు చేయించామని గుర్తు చేశారు. కాగా, వరదలో కొట్టుకుపోయి తండ్రీకుమార్తెలు మోతీలాల్, అశ్విని మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలుత పువ్వాడ, ఎంపీ వద్దిరాజు మున్నేరు వరదతో ముంపునకు గురైన బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్ ప్రాంతాల్లో పర్యటించి బాధితులను ఓదార్చారు. ప్రజలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బొమ్మెర రాంమూర్తి, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, తోట వీరభద్రం, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, గుండ్లపల్లి శేషగిరిరావు, తోట గోవిందమ్మ, కన్నం ప్రసన్నకృష్ణ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

నేడు కూడా పాఠశాలలకు సెలవు

ఖమ్మంసహకారనగర్: తుఫాన్ సూచనలకు తోడు ఇప్పటికే కురిసిన వర్షాలతో ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గకపోవడంతో మంగళవారం కూడా జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి కచ్చితంగా సెలవు పాటించాలని ఆదేశించారు.

రైళ్ల రద్దు కొనసాగింపు



ఖమ్మం రాపర్తినగర్: పలుచోట్ల రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో ఇప్పటికే కొన్ని రైళ్లను రద్దు చేసిన అధికారులు సోమవారం కూడా వాటిని నడిపించలేదు. ఇక మంగళ, బుధవారాల్లో కూడా కొన్ని రైళ్ల రద్దు చేసే అవకాశముందని తెలుస్తోంది. ఖమ్మం మీదుగా వెళ్లే కృష్ణ, ఇంటర్‌సిటీ, మచిలీపట్నం, మణుగూరు, చార్మినార్, శాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. ఇంకొన్ని రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు ఖమ్మం రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ తెలిపారు.

బంగారుతల్లికి వీడ్కోలు

- స్వగ్రామానికి చేరిన అశ్విని మృతదేహం
- ఆమె తండ్రి మోతీలాల్ మృతదేహం 24గంటల తర్వాత గుర్తింపు
- గంగారం తండాలో వందలాది మంది అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు


వైరా ఎమ్మెల్యే రాందాస్‌ను నిలదీస్తున్న కుటుంబీకులు

కారేపల్లి: ఆకేరు వాగు ఉధృతికి బలైన యువ శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని మృతదేహానికి మహబూబాబాద్‌లో పోస్ట్‌మార్టం అనంతరం ఆదివారం రాత్రి స్వగ్రామమైన కారేపల్లి మండలం గంగారంతండాకు తీసుకొచ్చారు. ఇక సోమవారం మళ్లీ తనిఖీలు చేపట్టిన రెస్క్యూటీం సభ్యులు ఆమె తండ్రి మోతీలాల్ మృతదేహాన్ని డోర్నకల్ మండలం చిలక్కొయలపాడు వద్ద గుర్తించారు. ఆపై పోస్టుమార్టం చేయించి స్వగ్రామానికి తీసుకురాగా అప్పటికే బంధువులు, గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వందలాదిగా తరలివచ్చారు. గంటల తరబడి కన్నీళ్లతో ఎదురుచూసుకున్న వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా అందరూ కంటతడి పెట్టారు.

కన్నీటి సంద్రమైన గంగారంతండా

గంగారం తండాకు చెందిన మోతీలాల్ – నేజీకి అశ్విని, అశోక్‌కుమార్ సంతానం. పదో తరగతి కారేపల్లిలో చదివి 550 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన అశ్విని విజయవాడలో ఇంటర్, అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేసింది. బీఎస్సీలో మూడు రజత పతకాలు, యూనివర్సిటీ స్థాయిలో ఆరు బంగారు పతకాలే కాక ఆపై ఎమ్మెస్సీలోనూ బంగారు పతకం సాధించింది. ఆతర్వాత జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందింది. ఇక జాతీయ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తల నియామక మండలి(అగ్రికల్చర్ శాస్త్రవేత్తల రిక్రూట్‌మెంట్ బోర్డు) నిర్వహించిన పరీక్షలో వందల మంది పోటీ పడగా అశ్విని జాతీయ స్థాయిలోనూ ప్రథమ స్థానం సాధించి జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ప్రస్తుతం అశ్విని ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తోంది. గతనెల 29న సోదరుడు అశోక్ నిశ్చితార్థానికి హాజరైన ఆమె ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో విమానం ఎక్కాల్సి ఉంది. దీంతో తండ్రి మోతీలాల్ కారులో తీసుకెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరులో గల్లంతైన విషయం విదితమే. ఇందులో అశ్విని మృతదేహం ఆదివారం మధ్యాహ్నం, మోతీలాల్ మృతదేహం సోమవారం లభించగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. అప్పటికే చేరుకున్న స్థానికులు ఉజ్వల భవిష్యత్ ఉన్న శాస్త్రవేత్త అశ్వినిని ఆకేరు వాగు మింగిందా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరి మృతదేహాలను ట్రాక్టర్‌పై ఊరేగింపుగా గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈక్రమంలో అశ్విని తల్లి నేజీ, సోదరుడు అశోక్‌కుమార్ రోదనలను ఆపడం ఎవరి వల్లా కాలేదు.


అశ్విని, మోతీలాల్ మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

వైరా ఎమ్మెల్యేకు నిరసన సెగ

వాగులో గల్లంతై మృతదేహాలు లభించక తాము నరకయాతన పడినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని మోతీలాల్ కుటుంబీకులు ఆరోపించారు. కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌ను వారు నిలదీశారు. అయితే, ఆకేరులో కారు గల్లంతైనప్పటికీ అక్కడి కలెక్టర్ సహా అధికారులతో తాను మాట్లాడానని, వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ రాకపోవడంతో వారిని కాపాడలేకపోయామని సర్దిచెప్పారు. ఆ కుటుంబానికి తక్షణ సాయంగా కింద రూ.50వేలు అందజేశారు.

మహానేత వైఎస్సార్..

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క


మధిరలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర/ఖమ్మం వన్‌టౌన్/ముదిగొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల మదిలో చిరకాలం ఉంటాయని.. ఆయనను మహానేతగా అంతా గుర్తుంచుకున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం మధిరలోని ఆయన విగ్రహానికి భట్టి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలను అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. అలాగే, ఖమ్మంలోకి కాంగ్రెస్ కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భట్టి వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, మలీదు వెంకటేశ్వర్లు, మొక్కా శేఖర్‌గౌడ్, మిక్కిలినేని నరేందర్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, ప్రతిభారెడ్డి పాల్గొన్నారు. ఇక ముదిగొండ మండలం గోకినేపల్లినిలో వరదతో దెబ్బతిన్న మోరీ వాగు, పరిసరాల్లో పంట పొలాలను డిప్యూటీ సీఎం భట్టి పరిశీలించారు. పంటలు, ఇళ్లకు జరిగిన నష్టంపై ఆరా తీయగా.. గ్రామం చుట్టూ హైవే ఉండడంతో వర్షపునీరు వెళ్లే పరిస్థితి లేనందున అండర్ పాస్‌కు ఖానాలు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరారు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు కొమ్మినేని రమేష్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, మీగడ శ్రీనివాస్‌యాదవ్, వినోద్, బాబునాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంటల నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

మధిర/ఎర్రుపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలతో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇస్తామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. మధిర మండలం మాటూరు, ఎర్రుపాలెం మండలం మీనవోలు తదితర గ్రామాల్లో వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి, పత్తి తదితర పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న నేపథ్యాన రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆతర్వాత ఆయన రుణమాఫీలో భాగంగా కుటుంబ నిర్ధారణకు చేపట్టిన సర్వేను కూడా పరిశీలించారు. ఏడీఏ ఎస్.విజయ్‌చంద్ర, ఏఓలు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, ఎం.రాధ, ఏఈఓలు నిఖిత, అమృత, వంశీకృష్ణ, సుష్మ, బాలకృష్ణ, సింధూర్, కృష్ణకుమారి, సొసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల పరిశీలన



రేషన్ షాప్ వద్ద పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ఖమ్మంలోని మోతినగర్, బొక్కలగడ్డ, కాల్వొడ్డు తదితర ప్రాంతాల్లోని ఆరు రేషన్ దుకాణాల్లోకి వరద చేరింది. దీంతో బియ్యం తడిసిపోయాయని డీలర్ల సంఘం నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలను జిల్లా ప్రత్యేక అధికారి వీ.పీ. గౌతమ్ శుక్రవారం పరిశీలించి సూచనలు చేశారు. డీఎస్‌ఓ చందన్ కుమార్, డీటీ విజయబాబు, డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానీమియా తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సిద్ధం

వరద ముంపు ప్రాంతాల్లోని వారికి నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కలెక్టరేట్‌లో ఐదు కిలోల బియ్యం ప్యాకెట్లను సిద్ధం చేశారు. వీటిని నిర్దేశిత ప్రాంతాలకు పంపించి ఇతర సామగ్రితో సహా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వరద బాధితులకు చేయూత



కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న డీఈఓ శర్మ

నేలకొండపల్లి: ఆయనేమీ కోటీశ్వరుడు కాదు... ఎకరాల సాగు భూమి లేకపోగా సామాన్య కౌలు రైతు... అయినా దాతృత్వంలో మేటిగా నిలిచాడు. నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం, సుర్దేపల్లి గ్రామాల్లో వరద బాధితులకు బోదులబండ ఉన్నత పాఠశాలలో పునరావస కేంద్రం ఏర్పాటుచేశారు. ప్రభుత్వం కంటే ముందుగానే గ్రామానికి చెందిన కౌలు రైతు కోటారి రామనాధం తానున్నానని రోజూ 300 మందికి భోజనాలు, టిఫిన్లు ఏర్పాటు చేయించాడు. ఆయనకు తోడు గ్రామానికి చెందిన అనంతు నాగేందర్ గౌడ్, గుండు మహేష్ సాయంగా నిలవగా సోమవారం కేంద్రాన్ని సందర్శించి డీఈఓ సోమశేఖర్‌శర్మ, ఈసీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి అభినందించారు.

కేజీబీవీలో గోడలకు విద్యుత్ ప్రసారం

కొణిజర్ల: కొణిజర్ల మండలం బస్వాపురం సమీపాన ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గోడలకు విద్యుత్ సరఫరా అవుతోంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కేజీబీవీలో ఎర్త్ అవుతూ బాలికల డార్మిటరీ గదిలో గోడలకు విద్యుత్ ప్రసరిస్తోంది. దీంతో శని, ఆదివారాలలో బాలికలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ నేపథ్యాన సోమవారం ఉదయం మరింత ప్రమాదకరంగా ఉండడంతో పిల్లల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇంటికి పంపించారు. ఈవిషయమై ఎస్‌ఓ సౌజన్యను వివరణ కోరగా డార్మిటరీలో ఓ కిటికీకి విద్యుత్ ప్రసరిస్తున్న మాట నిజమేనని తెలిపారు. అయితే, పిల్లలను ఇంటికి పంపడానికి ఇది కారణం కాదని చెప్పారు. మున్నేరు వరదతో ఖమ్మంలోని పలుచోట్ల ఇళ్లు నీట మునగగా ప్రభుత్వ సాయం కోసం ఫొటోలు దిగాలని తల్లిదండ్రులు కోరడంతో పంపించామని తెలిపారు. అంతేకాక ఎలక్ట్రీషియన్‌ను పిలిపించి వైర్లు చేయిస్తున్నామని ఆమె వెల్లడించారు.

రోడ్డుప్రమాదం కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణికి చెందిన గుంటేటి రవికుమార్ తదితరులు 2015 జనవరి 17న ఆటోలో వెళ్తున్నారు. ఈక్రమంలో మెదక్ జిల్లాకు చెందిన మహ్మద్ జిలానీ వ్యాన్‌లో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన ఖమ్మం రూరల్ పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. దీంతో విచారణ అనంతరం జిలానీకి ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి బిందుప్రియ తీర్పు చెప్పారు.

25పైగా వంతెనలు ధ్వంసం

రహదారులు, బ్రిడ్జి మరమ్మతులకు రూ.100 కోట్లు

ఖమ్మంఅర్బన్: భారీ వర్షంతో జిల్లాలోని పలుచోట్ల ఆర్అండ్‌బీ రహదారులు దెబ్బతినగా 25కు పైగా వంతెనలు వరద ప్రభావంతో కొట్టుకుపోయాని అధికారులు గుర్తించారు. వాగులు, ఏరులపై ఉన్న వంతెనల వద్ద వరద తాకిడికి వంతెనలు ఎక్కడిక్కడే కుప్పకూలినట్లు చెబుతున్నారు. ప్రధానంగా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో నష్టతీవ్రత ఉందని తేల్చారు. తిరుమలాయపాలెం మండలంలోని మరిపెడ దారిలో రావిశెట్టితండా వద్ద సుమారు 200 మీటర్ల నిడివి 16 ఖానాలతో ఉన్న వంతెన కొట్టుకుపోయిందని, దీని మరమ్మతుకు రూ.20కోట్లు అవసరమని భావిస్తున్నారు. మొత్తంగా జిల్లాలో దెబ్బతిన్న వంతెనలు, రహదారుల తాత్కాలిక మరమ్మతుల కోసం సుమారు రూ.100 కోట్లకు పైగానే వ్యయమవుతుందని చెబుతున్నారు. ఖమ్మంలోని ధంసలాపురం ఫ్లైవర్, ప్రకాష్‌నగర్ వంతెన వద్ద వద్ద దెబ్బతిన్న రోడ్లకు ఆర్అండ్‌బీ ఎస్‌ఈ హేమలత పర్యవేక్షణలో ఇంజనీర్లు సోమవారం మరమ్మతులు మొదలుపెట్టారు. ఇక వాగులు, ఏరుల వరద ప్రభావంతో రోడ్లు మలుపు ఉన్న చోట దెబ్బతిన్నట్లు తెలిసింది. రఘునాథపాలెం మండలంలోని ఖమ్మం - డోర్నకల్ రోడ్డులో కోయచలక వద్ద రహదారి భారీగా కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. ఈమేరకు తాత్కాలికంగా పైపులు వేసి మట్టి నింపి మంగళవారం నుంచి రాకపోకలు మొదలయ్యేలా చర్యలు చేపట్టారు.





ధంసలాపురం వంతెన వద్ద రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ హేమలత, (ఇన్‌సెట్) తిరుమలాయపాలెం మండలం రావిచెట్టుతండా వద్ద దెబ్బతిన్న వంతెన

తెగిన చెరువులు.. పలుచోట్ల గండ్లు

- సాగర్ కాల్వలకు సైతం గండ్లు?
- జలాశయాల్లోకి సామర్థ్యానికి మించి వరద
- తక్షణ మరమ్మతులకు రూ.10కోట్లు అవసరం

ఖమ్మంఅర్బన్: భారీ వర్షంతో జిల్లా వ్యాప్తంగా 26 చెరువులకు తెగాయని, కాల్వలకు 13 చోట్ల గండ్లు పడ్డాయని జలవనరులశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటి తక్షణ మరమ్మతుల కోసం రూ.10.34 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. పాలేరు రిజర్వాయర్‌కు అలుగు ద్వారా 80వేల క్యూసెక్కుల వరకు ప్రవహిస్తే తట్టుకునేలా డిజైన్ ఉంది. అయితే, మునుపెన్నడూ లేని విధంగా వరద రావడంతో అలుగు పొంగి సుమారు 1.68 వేల క్యూసెక్కుల వరద వెళ్లడం, దిగువన సాగర్ కాల్వకు సైతం వరద పోటుతో మూడు చోట్ల గండ్లు పడ్డాయని గుర్తించారు. పాలేరు రిజర్వాయర్ నిర్మించాక ఈ స్థాయిలో వరద ఎన్నడూ రాలేదని చెబుతున్నారు. వరద ప్రభావం పూర్తిగా తగ్గితే దెబ్బతిన్న చెరువుకట్టలు, అలుగులు, తూములు, గండ్లు పడిన కాల్వ కట్టలపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. కాగా, జిల్లాలోని 984 చెరువుల్లో 821 అలుగు పారుతున్నాయి. ఇక 161 చెరువుల్లోకి 75–100శాతం, మరో రెండు చెరువుల్లో 50–75శాతం మేర నీరు చేరిందని జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు. కాగా, లంకాసాగర్ ప్రాజెక్టులో 16 అడుగులకు 17.07 అడుగులు, బేతుపల్లి చెరువులో 16 అడుగులకు గాను 17 అడుగులు, జాలిముడి ప్రాజెక్టులో 15 అడుగులకుగాను 18 అడుగులు, కట్టలేరు ఆనకట్ట వద్ద ఏడు అడుగులకు గాను 9.6 అడుగులు, ఖమ్మం మున్నేరు పూర్తిస్థాయి నీటి మట్టం 24 అడుగులు కాగా అంతకు మించి వరద ప్రవహిస్తోంది.



పాలేరు హైడల్ ప్రాజెక్టు కాల్వ నుండి ఎడమ కాల్వలోకి భారీగా చేరుతున్న నీరు

పాలేరు, వైరాకు తగ్గిన వరద

కూసుమంచి/వైరా: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు ఆదివారం వరద పోటెత్తగా సోమవారం తగ్గుముఖం పట్టింది. రిజర్వాయర్‌లోకి గతంలో ఎన్నడూ లేనట్లుగా సుమారు 2లక్షల క్యూసెక్కుల వరదనీరు చేరింది. సోమవారం ఉదయం నుండి రిజర్వాయర్‌కు వరద క్రమంగా తగ్గుతూ సాయంత్రం 40వేల క్యూసెక్కులకు పడిపోయింది. అయినప్పటికీ వరద మినీ హైడల్ ప్రాజెక్టు వద్ద కాల్వ పొంగి ఎడమ కాల్వ కట్ట తెగి భారీగా ప్రవహిస్తోంది. ఫలితంగా నీరంతా పొలాల మీదుగా పాలేరు ఏటిలో కలుస్తోంది. ఇక వైరా రిజర్వాయర్ సైతం వరద తగ్గింది. రిజర్వాయర్‌లోకి పూర్తిస్థాయి నీటి మట్టం 18.3 అడుగులు దాటి 19.3 అడుగులకు చేరుకోగా.. ఐదు అలుగుల ద్వారా వరద బయటకు వెళ్తోంది. మూడు రోజుల్లో మూడు టీఎంసీల నీరు కృష్ణానదిలో కలవగా.. లోతట్టు ప్రాంతాలు కూడా జలమయమయ్యాయి.

విద్యుత్ శాఖకు రూ.7.70 కోట్ల నష్టం

ధ్వంసమైన 1,900 స్తంభాలు, దెబ్బతిన్న 570 ట్రాన్స్‌ఫార్మర్లు

ఖమ్మంవ్యవసాయం: ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాలు, వరదల కారణంగా ఖమ్మం ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ శాఖకు రూ.7.70 కోట్ల మేర నష్టం జరిగింది. ప్రకృతి వైపరీత్యంతో 1,900 స్తంభాలు ధ్వంసం కాగా, 570 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు శాఖ గుర్తించింది. వీటికి తోడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు జల దిగ్బంధంలో చిక్కుకుపోగా దెబ్బతిన్నాయి. ఖమ్మంలోని ప్రకాష్‌నగర్, దానవాయిగూడెం, మధిర, పాలేరు, ఖమ్మం రూరల్ మండలంలోని మంగళ తండా సబ్ స్టేషన్లు జలవలయంలో చిక్కుకున్నాయి. సబ్ స్టేషన్లలో యంత్రాలను సరిచేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలు సబ్ స్టేషన్లు నిర్వహణలోకి రాగా మరికొన్నింటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయినా అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా మొదలుకా ప్రజలు అంధకారంలోనే ఉన్నారు.

సబ్‌స్టేషన్లలో సీఎండీ తనిఖీ

వర్షాలు, వరదతో జిల్లాలోని పలుచోట్ల విద్యుత్ అంతరాయాలు ఏర్పడగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి దానవాయిగూడెం, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టేలా ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.



ప్రకాశ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కూలిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు



సబ్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

సీఎం వస్తున్నారని వాహనాల నిలిపివేత

కొణిజర్ల: వరద ముంపు ప్రాంతాల పరిశీలనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా కొణిజర్ల సమీపాన పోలీసులు భారీ వాహనాలను నిలిపివేశారు. పల్లిపాడు స్టేజీ వద్ద భారీ వాహనాలు, లారీలను అడ్డుకుని కొణిజర్ల సమీపంలోని ఓ వెంచర్‌లోకి మళ్లించి ఆపేశారు. ఖమ్మం బైపాస్ బ్రిడ్జి పైనుంచి సీఎం వరద ప్రవాహాన్ని పరిశీలించే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ జామ్ కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లూరులో....

కల్లూరురూరల్: భారీ వర్షాలతో పలుచోట్ల రహదారులు దెబ్బతినడం, ఖమ్మంలోని మున్నేరు వరద ఉధృతి దృష్ట్యా అటువైపుగా వెళ్లే వాహనాలను కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్‌లో సోమవారం నిలిపివేశారు. భారీ సామర్థ్యం కలిగిన వాహనాలను ఆపేశారు. పరిస్థితులు చక్కబడ్డాక అన్ని వాహనాలను పంపించనున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే, ఖమ్మం బైపాస్ వద్ద బ్రిడ్జి పైనుంచి సీఎం రేవంత్‌రెడ్డి వరదను పరిశీలించే అవకాశం ఉన్నందునే వాహనాలను ముందస్తుగా నిలిపేసినట్లు తెలిసింది.

రూ.1.50లక్షల విలువైన కోడిపిల్లలు మృతి

పెనుబల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెనుబల్లి మండలం వీఎం బంజరులో ఫాంలో కోడిపిల్లలు మృతి చెందాయి. వీఎం బంజర బేడా బుడగ జంగం కాలనీ సమీపాన తూరపాటి అబ్బస్వామి బాయిలర్ కోళ్లఫారం ఏర్పాటు చేశారు. వర్షాలతో ఫాంలోకి నీరు చేరగా రూ.1.50 లక్షల విలువైన 2 వేలు కోడిపిల్లలు మృతి చెందాయని బాధితుడు తెలిపారు.

బైక్‌పై తిరుగుతూ.. బాధితులను ఓదారుస్తూ

ముంపు ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్: మోకాల్లోతు బురదలో కూరుకుపోయిన మున్నేరు ముంపు కాలనీల్లో బైక్‌పై సోమవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి, జలగంనగర్, సాయిప్రభాత్‌నగర్, పెద్దతండా, రాజీవ్ గృహకల్ప ప్రాంతాలను సోమవారం ఉదయమే పరిశీలించిన వారు నష్టం వివరాలు తెలుసుకుంటూ బాధితులకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ అక్కున చేర్చుకుంటుందని తెలిపారు.

మంత్రి కాలికి గాయం

కూసుమంచి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో బైక్‌పై పర్యటించారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలికి గాయమైంది. దీంతో కూసుమంచిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఆయనకు వైద్యులు చికిత్స చేశారు. ఆతర్వాత మంత్రి తన పర్యటన కొనసాగించారు.



బైక్‌పై కాలనీల్లో పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి



బురదలో వెళ్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

అనూహ్యరీతిలో భారీ వర్షం, వరద

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: కొద్ది సమయంలోనే అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో మునుపున్నడూ లేని విధంగా వరద వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్నేరుకు వచ్చిన వరదతోవేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని చెప్పారు. సహాయక చర్యల్లో ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవమేనన్నారు. ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న వారిని రక్షించేందుకు హెలికాప్టర్ రప్పించాలని భావించినా వాతావరణం అనుకూలించలేదని తెలిపారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో అధికారులు, కార్పొరేటర్లు, నాయకుల సమన్వయంతో ప్రాణనష్టం జరగకుండా చూశామన్నారు. వివిధ రహదారులు, ఇళ్లు బురదమయం కావడంతో జిల్లాలో అన్ని శాఖల సిబ్బందిని రప్పించి యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు. ఇస్కాన్, హరేరామ హరేకృష్ణ, సత్యసాయి స్వచ్ఛంద తదితర సంస్థలు బాధితులకు అండగా నిలిచాయని, ప్రభుత్వం తరఫున వరద బాధితులను ఆదుకుంటామని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సర్టిఫికెట్లు ఇప్పించే బాధ్యత నాది..

- యుద్ధప్రాతిపదికన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం
- మున్నేరు వరద బాధితులతో సీఎం రేవంత్‌రెడ్డి
- నిరసనల నడుమ సాగిన ముఖ్యమంత్రి పర్యటన

ఖమ్మంరూరల్/ఖమ్మం వన్‌టౌన్/కూసుమంచి: మున్నేరు వరద బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. వరదతో సర్టిఫికెట్లు కోల్పోయిన వారు ఆందోళన చెందాల్సిన పని లేదని.. అందరికీ సర్టిఫికెట్లు త్వరగా ఇప్పిస్తామన్నారు. మున్నేరు వరద ముంపు ప్రాంతమైన ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈమేరకు తురకకుమారి, అన్నపూర్ణమ్మ ఇళ్లలోకి వెళ్లిన సీఎం వరద ఎంతమేర, ఎంత ఎత్తులో వచ్చిందో తెలుసుకున్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.650కోట్లు నిధులు విడుదల చేసి పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని తెలిపారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ కాలనీ సైతం వైఎస్సార్ కట్టించారని గుర్తుచేశారు. తొలుత కూసుమంచి మండలంలో పాలేరు వాగు ప్రవాహంతో గండి పడిన ప్రాంతంను పరిశీలించి మరమ్మతులపై సీఈ విద్యాసాగర్‌తో ఆరా తీశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వివిధ సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, మేయర్ నీరజతో పాటు పోట్ల నా గేశ్వరరావు, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళలు

కరుణగిరి రాజీవ్ గృహకల్ప వద్ద బాధితులను పరామర్శించిన సీఎం వెళ్తుండగా కొందరు మహిళలు కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. వరద సాయం మరింతగా పెంచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



తన ఇంటిలోకి వచ్చి చూడాలని సీఎం వాహనాన్ని అడ్డుకుంటున్న మహిళ



బొక్కలగడ్డలో రోడ్డుపై సామగ్రితో నిరసన తెలుపుతున్న బాధితులు

బాధితులను ఉద్దేశించి మాట్లాడిన కాన్వాయ్‌లోకి వెళ్తున్న క్రమంలో సైతం సీఎంను అడ్డుకుని సాయం త్వరగా అందించాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన అన్నిరకాలుగా ఆదుకుంటామని తెలిపారు.

నష్టపరిహారం చెల్లిస్తాం

ఖమ్మంక్రైం: వరద ముంపునకు గురైన బాధితులకు సకాలంలోనే నష్టపరిహారం అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మున్నేరు పరివాహక ప్రాంతమైన బొక్కలగడ్డలో ఆయన పర్యటించారు. సీఎం రాకముందే బొక్కలగడ్డలోని వరద బాధితులు సీఎం డౌన్ డౌన్, ముగ్గురు మంత్రులు డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ తడిసిన సామగ్రిని రోడ్డుపై వేసి నిరసన తెలిపారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. ఆపై భారీ భద్రత నడుమ మంచికంటి నగర్ మీదుగా సీఎం పర్యటన కొనసాగింది. మధ్యమధ్యలో కూడా కొందరు నిరసన తెలిపారు. అనంతరం బైపాస్ రోడ్డు మీదుగా ఆయన ఓపెన్ టాప్ జీప్‌లో పర్యటించారు. కాగా, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సునీల్‌దత్ బందోబస్తును పర్యవేక్షించారు. అయితే, సీఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

శభాష్.. కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

రాకాసితండా సహాయక చర్యల్లో కీలకం

తిరుమలాయపాలెం మండలం రాకాసితండాను ఆకేరు వరద ముంచెత్తగా ప్రజలను కాపాడేందుకు కానిస్టేబుల్ లూనావత్ వెంకటేశ్వర్లు చేసిన కృషి అందరి అభినందనలు అందుకుంటోంది. ఆదివారం ఇళ్లలోకి వరద చేరుతుండడంతో తండావాసులు ఇళ్ల పైభాగానికి చేరుకున్నారు. సహాయక చర్యలకు రంగంలోకి దిగిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి తోడుగా వెంకటేశ్వర్లు కూడా వెళ్లాడు. గ్రామానికి వెళ్లే క్రమాన వరదలో గుట్టలు, కొండ ప్రాంతాల వివరాలను ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి చెబుతూ ప్రజలందరినీ ఒడ్డుకు చేర్చాడు. ఆయన గతంలో కారేపల్లిలో చెరువులో దూకిన తండ్రీకూతుళ్లను కూడా రక్షించి అవార్డు తీసుకున్నాడు. – తిరుమలాయపాలెం



వరద ప్రవాహంలో చిక్కుకున్న వృద్ధురాలిని ఎత్తుకుని వస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

డీసీసీబీ అక్రమాలపై విచారణ

- ఇంక్రిమెంట్లు, బదిలీలు, ఆడిట్, రైతుబీమాపై ఆరా
- త్వరలోనే చర్యలకు రంగం సిద్ధం?

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లో పలు అంశాలపై ఆరోపణల నేపథ్యాన సహకార శాఖ, రాష్ట్ర సహకార బ్యాంక్(టీజీ క్యాబ్) వేర్వేరుగా విచారణ చేపట్టాయి. డీసీసీబీ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ పాలకవర్గంతో ప్రమేయం లేకుండా పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారని, ఇందులో అవినీతి జరిగిందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన సమగ్ర విచారణకు ఆదేశించారు. బ్యాంకులో 90 మంది ఉద్యోగులు, అధికారులకు బకాయి ఉన్న రూ.78 లక్షల మేర ఇంక్రిమెంట్లు, ఇతర ప్రోత్సాహకాల చెల్లింపు, అధికారులు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, నెలవారీ ఆడిట్ ఖర్చుల రెట్టింపు, రైతుల జీవిత బీమా వ్యవహారంలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ అవధానుల శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించగా, టీజీ క్యాబ్ డీజీఎం సురేఖను నియమించింది. ఇందులో అవధానుల శ్రీనివాస్ ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులు, ఆడిట్, జీవిత బీమాపై సోమవారం విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. మరోపక్క టీజీ క్యాబ్ డీజీఎం సురేఖ మంగళవారం నుంచి విచారణ చేయనున్నట్లు తెలిసింది. రైతు రుణమాఫీ డీసీసీబీ పరిధిలో 1.69 లక్షలకు మందికి రూ.892 కోట్లు వర్తించాల్సి ఉండగా, కేవలం 68 వేల మంది రైతులకు రూ.274 కోట్లు అందాయి. ఈ విషయాన్ని టీజీ క్యాబ్ పరిశీలిస్తుండగా పరిణామాలు ఎటు దారి తీస్తాయోనన్న చర్చ జరుగుతోంది. ఆయా అంశాల్లో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉదయ్‌కుమార్ రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. బ్యాంకు ఉన్నతాధికారులపై ఒకటి, రెండు రోజుల్లో చర్యలు తీసుకునే అవకాశముందని ఓ అధికారి తెలిపారు.